సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 19-9-2024

సంపుటి: 20 సంచిక: 151

పేజీలు: 4 వెల: రూ.1



## మాజీమంత్రి గుండకు అస్వస్థత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

మాజీమంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అస్వస్తతకు గురయ్యారు. సోమవారం ఆయనకు వాంతులు కావడంతో మంగళవారం విశాఖపట్నం హెల్త్‌సిటీలో ఉన్న కేర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యపరీక్షల అనంతరం ఆయన మెదడులో రక్తం కొన్నిచోట్ల గడ్డకట్టి ఉందని నిర్ధారించారు. ఇంజక్షన్ల ద్వారా వీటిని కరిగించడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ఆయనకు బుధవారం సర్జరీ చేసి రక్తపు గడ్డలను తొలగించారు. ప్రస్తుతం ఆయన ఐసీయూలో ఉన్నారని, త్వరలోనే కోలుకుంటారని కుటుంబ సభ్యులు తెలిపారు.





## వైకాపా జిల్లా అధ్యక్షుడు దాస్..
## పార్లమెంట్‌కు సీతారాం

### తాడేపల్లిలో జగన్‌తో ఇన్‌ఛార్జిల భేటీ
### సమావేశానికి ధర్మాన డుమ్మా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా వైకాపా అధ్యక్షుడిగా నరసన్నపేట మాజీ శాసనసభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్‌ను మరోసారి కొనసాగించడానికి ఆ పార్టీ చీఫ్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అలాగే జిల్లాలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధి ఎంపీ సెగ్మెంట్‌కు ఇన్‌ఛార్జిగా ఆమదాలవలస మాజీ శాసనసభ్యుడు తమ్మినేని సీతారాంను నియమిస్తున్నట్టు ప్రకటించారు. ఈమేరకు గురువారం జగన్మోహన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఉత్తరాంధ్రకు చెందిన నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, ఎమ్మెల్సీలతో జగన్మోహన్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీని బలోపేతం చేయడానికి రెండు పదవులు కేటాయించినట్లు పేర్కొన్నట్లు సమాచారం. త్వరలోనే రీజనల్ కోఆర్డినేటర్ పదవులకు ఆ పార్టీ మంగళం పాడుతున్న నేపథ్యంలో కొత్తగా పార్లమెంటరీ ఇన్‌ఛార్జి అనే పోస్టును సృష్టించారు. దీనికే ఇప్పుడు సీతారాం అధ్యక్షులుగా వ్యవహరించనున్నారు. జగన్మోహన్‌రెడ్డితో సమావేశానికి మాజీ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరుకాలేదు. గత కొన్నాళ్లుగా జిల్లాలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలు దేనిలోనూ ఆయన కనిపించడంలేదు. ఆరోగ్యం సహకరించకపోవడం వల్ల విజయవాడ రాలేకపోయారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇటీవల ఆయన ఇంటి వ్యవహారం రచ్చకెక్కడంతో ఆయనతో ప్రత్యేకంగా మాట్లాడతారని అంతా భావించినా ఈ విషయం మీద జగన్ నోరు మెదపలేదని తెలిసింది.



రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద సీజ్ చేసిన లారీలు

- ఎమ్మెల్యేకే సవాల్ విసురుతున్న ఆ నలుగురు
- గతంలో వారించినా ఆగని దందా
- మైన్స్, రెవెన్యూ అధికారులను కొనేసిన వైనం
- టీడీపీలో ఇసుక దుమారం

# మాకంటే ఎవడు తోపు.. దమ్ముంటే ఆపు!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

"శ్రీకాకుళం నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యే టిక్కెట్ ఆశిస్తున్నప్పుడు ఎవరూ ఆయన వెనుక లేకపోయినా నేనొక్కడ్నే ఉన్నాను. ఇప్పుడు ఎమ్మెల్యే అయినంత మాత్రాన ఇసుక ఎత్తుకుంటే వచ్చిన అభ్యంతరమేమిటి? ఆయన చెప్పినంత మాత్రాన ఆపేస్తామా?.."

..ఇది స్వయంగా ఎమ్మెల్యే స్వగ్రామానికి చెందిన ఒక టీడీపీ నాయకుడి వాదన.


"శ్రీకాకుళం టిక్కెట్ గుండ లక్ష్మీదేవికి ఇవ్వకపోయినా పార్టీ సింబల్ శంకర్‌తో ఉంది కాబట్టి నేను ఆయన గెలుపు కోసం పని చేశాను. ఇప్పుడు నా పంచాయతీ పరిధిలో ఉన్న ఇసుకను అమ్ముకుంటే ఆయనకొచ్చిన నొప్పేంటి? ఆయన చెప్పినంత మాత్రాన ఆగిపోతే మరి మేమెందుకు రాజకీయాలు చేయడం?"

.. ఇది బూరవిల్లిలో మరో టీడీపీ నాయకుడి భావన.

పోనీ గొండు శంకర్‌తో మొదట్నుంచి ఉన్నానని చెబుతున్న వ్యక్తికి ఈ నియోజకవర్గంలో, లేదూ అంటే ఆయన సొంత గ్రామం కిష్టప్పేటలో శంకర్ కంటే బలముందా అంటే అదీ లేదు. పోనీ శంకర్ గెలుపు కోసం ఆయన ఆస్తులు కరగదీసుకున్నారా అంటే ఆవైపే ఆలోచించక్కర్లేదు. కానీ కాసులు కురిపిస్తున్న ఇసుక విషయంలో మాత్రం ఆయన ఎమ్మెల్యేని లెక్క చేయడంలేదు. ఇక బూరవిల్లిలో ఉన్న టీడీపీ నాయకుడు సర్పంచ్‌గా గెలవగలడా? అంటే.. కష్టమనే మాట గతంలో జరిగిన అనేక ఎన్నికలు రుజువుచేశాయి. గుండ కుటుంబంలో ఎవరు ఎమ్మెల్యేగా ఉన్నా మూడో కంటికి తెలియకుండా ఇసుకను తరలించుకుపోయిన వీరు ఇప్పుడు ఇసుక అక్రమ రవాణాకు తాను వ్యతిరేకమని శంకర్ ప్రకటిస్తే దాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. గెలిచినా, ఓడినా శంకరే కాబట్టి తమ పని మాత్రం ఆపే ప్రసక్తి లేదనే సంకేతాలు ఇస్తున్నారు. శంకర్ కాదన్నా తాము చేసుకుపోతామని, ఎందుకంటే రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడి సోదరుడికి ఇందులో ఒకరు దగ్గరి బంధువు. కాబట్టి శంకర్ ఒకటి రెండు సార్లు చెప్పి ఊరుకుంటారని ఆయన భావిస్తున్నట్టు కనిపిస్తుంది. కానీ కొద్ది రోజుల క్రితం 'శంకరా.. నిన్ను చల్లగా ముంచేస్తున్నా రబ్బాయా' అనే శీర్షికతో 'సత్యం' కథనం ప్రచురించిన తర్వాత అచ్చెన్నాయుడు ఈ విషయం మీద ఆరా తీసి ఆధారాలు తన వద్ద పెట్టుకున్నారు. రాష్ట్రంలో వరదల కారణంగా బిజీ అయిపోయిన అచ్చెన్నాయుడు ఇంకా ఇటువైపు దృష్టి సారించకపోవడంతో తాము చేసే పనులకు మంత్రి కుటుంబం వైపు నుంచి అండదండలున్నాయని వీరికి వీరే సర్టిఫికెట్ ఇచ్చుకొని ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నారు.

శ్రీకాకుళం నియోజకవర్గంలో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం ఒక్క భైరి ర్యాంపునే గుర్తించింది. అది కూడా కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఇంకా ప్రారంభం కాలేదు. కానీ గార మండలం బూరవిల్లితో పాటు మరికొన్ని చోట్ల టీడీపీ నాయకులు చల్లా వాసు, మల్లా అబ్బాయినాయుడులు

- మిగతా 4లో



విశాఖకు ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న లారీలు





## శివసేన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

బీజేపీ శివసేన (షిండే వర్గం) శాసనసభ్యులు చేసిన అనుచిత వ్యాఖ్యలపై శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అంబటి కృష్ణారావు ఆధ్వర్యంలో గురువారం ఇందిరా విజ్ఞాన్ భవన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ, దాని మిత్రపక్షాలు దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టే విధానాన్ని తమ నాయకుడు రాహుల్ గాంధీ బట్టబయలు చేస్తూ, వారిని ప్రశ్నిస్తుండటాన్ని జీర్ణించుకోలేక, బీజేపీ, దాని మిత్రపక్ష నాయకులు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. దీనిని తీవ్రంగా ఖండించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం వారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి, కె.వెంకట్రావు, అంబటి దాలినాయుడు, కె.రాంప్రసాద్, ఎ.రవికుమార్, అంబటి రాజారావు, అంబటి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## యూనిట్-4 ఆధ్వర్యంలో స్వచ్ఛ తా హీ సేవ



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం ప్రాంగణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచన మేరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా జలనేతి, సూత్రనేతి శుద్ధి క్రియలను ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యోగా శాఖ సమక్షంలో విద్యార్థినీ విద్యార్థులకు నేర్పించారు. డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి మాట్లాడుతూ మానవ జీవితంలో యోగా అంతర్భాగం కావాలని చెప్పారు. పీవో, యోగా విభాగ అధ్యక్షులు డాక్టర్ జి.ఈశ్వరరావు మాట్లాడుతూ ఈ క్రియ చేయడం వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ పెద్దింటి ముకుందరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు స్వచ్ఛ తా హీ సేవా వాలంటీర్లతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి.రమేష్, సీహెచ్ పోలిరాజు, కె.అర్చన పాల్గొన్నారు.

## ఏచూరి మరణం శ్రామిక ప్రజానీకానికి తీరని లోటు



(సత్యంన్యూస్, పొందూరు)

ప్రజా పోరాటాల వేగుచుక్క సీతారాం ఏచూరి మరణం శ్రామిక ప్రజానీకానికి, ప్రజాస్వామ్య శక్తులకు, దేశ ప్రజలకు తీరనిలోటని సిటు జిల్లా అధ్యక్షులు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. గురువారం శ్రీ రాజ్యలక్ష్మి పోల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించి నివాళి అర్పించారు. సిటు జిల్లా అధ్యక్షులు అమ్మన్నాయుడు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తుల సమన్వయ రథసారధిగా సీతారాం ఏచూరి దేశ ప్రజానీకానికి చేసిన కృషి అమోఘమైనదని, విద్యార్థి దశ నుంచి ఐదు దశాబ్దాలుగా ఎన్నో పోరాటాలకు ఊపిరి పోసిన ఆయన మరణం కష్టజీవులకు నష్టమని అన్నారు. సంతాప సభలో యూనియన్ నాయకులు పేడాడ అప్పలనాయుడు, కర్నేని గోవిందరావు, కోదండం, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత గ్యాస్ ప్రకటనపై ఎమ్మెల్యే శంకర్ హర్షం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దీపావళికి ఉచిత గ్యాస్‌ను అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడంపై ఎమ్మెల్యే గొండు శంకర్ హర్షం తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులైన సందర్భంగా సీఎం చంద్రబాబు మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత గ్యాస్‌ను దీపావళికి అందిస్తామని చెప్పారు. సంక్షేమ పథకాలన్నీ ఒకదాని తర్వాత ఒకటి అమలు చేస్తామని వెల్లడించారు. వరద బాధితులందరికీ సాయమందించడమే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. తప్పులు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న సమన్వయమే భవిష్యత్తులోనూ మూడు పార్టీల మధ్య ఉంటుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. అభిప్రాయ భేదాలు లేకుండా ముందుకు సాగాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలకు పిలుపునిచ్చారు. వైకాపా నేతలు నిత్యం విషప్రచారం చేస్తూనే ఉన్నారని, తాము ఏం చేస్తున్నామో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.



## ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

### ఫీల్డ్ జనరల్ మేనేజర్ శాలిని మీనన్
### యూనియన్ బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లక్ష్యమని ఫీల్డ్ జనరల్ మేనేజర్ శాలిని మీనన్ అన్నారు. రాగోలు కొత్త రోడ్డు జంక్షన్ వద్ద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖను గురువారం ప్రారంభించారు. పొందూరులో కూడా బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాతాదారులకు అత్యుత్తమ సేవలందించేందుకు మరింత చేరువగా ఉండాలనే లక్ష్యంతోనే నూతన శాఖను ప్రారంభించినట్లు తెలిపారు. యూనియన్ బ్యాంకులో గృహ, వాహన రుణాలతో పాటు వ్యక్తిగత, ప్రభుత్వ ఉద్యోగులకు రుణాలు అందజేస్తామన్నారు. ప్రత్యేకమైన కరెంట్ అకౌంట్స్, బాలికలకు యూనియన్ ముస్కాన్ అకౌంట్‌లు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా ఎంఎస్ఎంఈ రుణాలు వ్యాపారులకు అతి తక్కువ వడ్డీకే అర్హతను బట్టి త్వరితగతిన మంజూరు చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో రీజనల్ హెడ్ ఎం.వెంకటతిలక్, డిఆర్‌హెచ్ రవి, సుబ్ నారాయణ్, చీఫ్ మేనేజర్లు గాయత్రీ, చైతన్య, బ్యాంకు మేనేజర్లు శ్రీనివాస్, శ్రీను, నూతన శాఖ మేనేజర్ పి.అజయ్‌కుమార్, ఉద్యోగ సంఘ నాయకులు బి.శ్రీనివాస్, ఆఫీసర్ సంఘ నాయకులు కె.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పీఎన్ కాలనీలో చోరి

### ఇంట్లో లేరని గుర్తించి దోపిడి
### భారీగా బంగారం, నగదు అపహరణ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పీఎన్ కాలనీ పదో లైన్‌లో డోర్ లాక్ వేసిన ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు తలుపులు తెరిచి చొరబడి భారీగా బంగారం, నగదు అపహరించుకుపోయారు. బుధవారం అర్ధరాత్రి చోరి జరిగినట్టు ఎచ్చెర్ల పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంటి యజమాని సీహెచ్ రామూర్తి బూర్జ మండలం కొల్లివలస ఏపీ రెసిడెన్సియల్ స్కూల్‌లో మ్యాథ్స్ అసిస్టెంట్‌గా, ఆయన భార్య రమాదేవి కోటబొమ్మాళి గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్ హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. వీరిద్దరూ వ్యక్తిగత పనులపై ఈ నెల 14న బెంగళూరు వెళ్లారు. ఇంటి ప్రహరీ గేట్ తాళాలను మాత్రమే పని మనిషికి అప్పగించారు. ప్రతిరోజు పనిమనిషి వాకిలి కడిగి ముగ్గు వేసి వెళ్లిపోతుండేది. గురువారం ఏడు గంటలకు రోజు మాదిరిగానే గేటు తాళం తీసి లోపలికి వచ్చింది. అప్పటికే గ్రిల్స్ ప్రధాన ద్వారం తీసివుంది. ఇంటి యజమాని వచ్చారేమోనని బయటి నుంచే కేకలు వేసింది. ఎవరూ స్పందించకపోవడం, ప్రధాన ద్వారం కొంత డేమేజ్ కావడంతో పొరుగున ఉన్నవారికి సమాచారం ఇచ్చింది. దీంతో వారు బెంగళూరులో ఉన్న రమాదేవికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె ఆమదాలవలసలో టీచర్‌గా పనిచేస్తున్న సోదరికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, క్లూస్ టీం చేరుకొని ఆధారాలు సేకరించారు. సమీపంలో ఉన్న సీసీ టీవీల్లో రికార్డు అయిన డేటాను సేకరించారు. దుండగులు ఇంట్లో చొరబడి రెండు బెడ్‌రూంల్లో ఉన్న అల్మరాలను, రెండు బీరువాలను తెరిచి బంగారం, నగదు అపహరించుకుపోయారు. బీరువాలు, అల్మరాల్లో బట్టలను, వస్తువులను చిందరవందర చేసి విలువైన వస్తువులను దోచుకొని పోయినట్టు పోలీసులు గుర్తించారు. ఇంటి యజమానులు లేకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఇంట్లో చోరి జరిగిన విషయం తెలిసిన రామూర్తి, రమాదేవి దంపతులు బెంగళూరు నుంచి హడావుడిగా బయలుదేరి వస్తున్నట్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గురువారం సాయంత్రం 5 గంటలకు శ్రీకాకుళం చేరుకొని ఫిర్యాదు చేయనున్నట్టు పోలీసులకు తెలిపారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు ఎంతమేర బంగారం, నగదు అపహరణకు గురైందో తేలనంది.

• ఎడిటోరియల్

# జమిలీ సాధ్యమేనా?

జమిలీ ఎన్నికలకు కేంద్ర కేబినెట్ పచ్చజెండా ఊపింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన నివేదికకు ఆమోదముద్ర వేసింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో జెమిలీ ఎన్నికలు సాధ్యమేనా? రాజ్యాంగ పరంగా చిక్కులు ఎదురవుతాయా? అన్ని పార్టీలు సమ్మతి తెలిపే వాతావరణం ఉందా.. రాజ్యాంగపరంగా ఇంకా ఏం జరగాల్సి ఉంది.. తదితర అంశాలపై విపులంగా చర్చిద్దాం. రాజకీయ పార్టీల విభిన్న వాదనలు, అభిప్రాయాలతో పాటు రాజ్యాంగపరమైన చిక్కులు ఒక అడ్డంకి. భారతదేశ ఎన్నికల చరిత్ర చూస్తే 1951 నుంచి 1967 వరకు జమిలీ ఎన్నికలే జరిగాయి. అంటే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు దేశవ్యాప్తంగా ఒకేసారి జరిగాయి. ఎందుకంటే అప్పుడు కాంగ్రెస్ పార్టీ ఒక్కటే బలంగా ఉండేది. ఏకపార్టీ ఆధిక్యత ఉండేది. 67వ సంవత్సరం తర్వాత కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలను ముందస్తుగా రద్దు చేయాల్సి వచ్చింది. 1971లో కాంగ్రెస్ చీలిక తర్వాత ఒకసారి ఎన్నికలు ముందు జరిపారు. అప్పటితో ఈ బ్రేక్ మొదలైంది. జమిలీ ఎన్నికలనేవి కొత్తవి కావు. ఉదాహరణకు ఇప్పుడు కూడా లోక్‌సభ ఎన్నికలతో పాటు ఏపీ, ఒడిశాలో జమిలీయే జరుగుతున్నాయి. దేశానికి ఇది కొత్తకాదు. ఈ జమిలీ ఎన్నికల కోసం చాలాకాలం నుంచి చర్చ జరుగుతునే ఉంది. 1999లో జస్టిస్ బీపీ జీవన్‌రెడ్డి నాయకత్వంలో లా కమిషన్ సిఫారసు చేసింది. 2018లో కూడా 21వ లా కమిషన్ సిఫారసు చేసింది. అలాగే నీతి ఆయోగ్ కమిటీ సిఫారసు చేస్తుంది. కానీ రెండున్నర సంవత్సరాలకొకసారి అంటే ఐదు సంవత్సరాల్లో రెండు దశల్లో జమిలీ ఎన్నికలు జరపాలని నీతి ఆయోగ్ సూచించింది. ఎలక్షన్ కమిషన్ కూడా 1980లో ఈ రకం ఎన్నికలకు సూచించింది. అందువల్ల ఇదేమీ కొత్త కాదు. ఇప్పుడు దానినే తీసుకొస్తున్నారు. ఇది ప్రాక్టికల్‌గా జరగాలంటే 18 రాజ్యాంగ సవరణలు జరగాలని. ఇందులో కొన్నింటికి 50 శాతం కంటే ఎక్కువ రాష్ట్రాల ఆమోదం పొందాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది సాధ్యం కాకపోవచ్చు. ఎందుకంటే కొన్ని ప్రాంతీయ పార్టీలకు బీజేపీతో ఉన్న సంబంధాల రీత్యా దీనిపై నిర్ణయం తీసుకున్నాయి తప్ప మంచి చెడులతో సంబంధం లేదు. వాస్తవానికి ఇది ప్రాంతీయ పార్టీల ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారుతాయి. ప్రాంతీయ పార్టీలైన టీడీపీ, బీఆర్ఎస్‌లు ఫస్ట్ టెర్మ్‌లో మోడీతో ఉన్న సంబంధ బాంధవ్యాలతో అప్పుడు ఇవి బలపర్చాయి. వాటి లాభనష్టాలతో సంబంధం లేకుండా సమర్థించాయి. మరి ఆచరణ సాధ్యమా? అంటే చూడాలి. చట్టం ఏ రూపంలో తెస్తారు, ఈ శీతాకాల సమావేశాల్లో చట్టం తెస్తామంటున్నారు, కానీ కీలకమైన రాజ్యాంగ సమస్యలతో పాటు ప్రాక్టికల్ ఇష్యూలను ఏ విధంగా పరిష్కరిస్తారన్నదే తేలాల్సిన విషయం. ఉదాహరణకు కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు ఎందుకు ఏర్పాటు చేస్తున్నామంటే అధికారం ఏకీకృతమైతే దాని నష్టాన్ని నివారించడానికే. ఎమర్జెన్సీ కాలం మనకు చక్కని ఉదాహరణ. అసలు జమిలీయే కాకుండా గతంలో లాగ రాచరిక పాలన అంటే ఒకటే ప్రభుత్వం. ఉదాహరణకు మౌర్యచంద్రగుప్తుల కాలం, వివిధ రాజుల పరిపాలన కాలం, లేదా కనిష్కుల కాలంలో ఒకటే ప్రభుత్వం ఉండేది. మిగతా అంతా సామంత రాజులే. ఇప్పుడు ఆ పద్ధతిలో పరిపాలన సాగిస్తే ఎన్నికల గందరగోళం ఉండదు, ఖర్చు ఉండదు, సమయం వృధా కాదంటున్నారు. మరి ఒప్పుకుందామా? ప్రస్తుత ఎన్నికల విధానం రాజ్యాంగ రీత్యా ఎందుకు ఏర్పాటు చేశారంటే.. ఇంత పెద్ద దేశంలో అధికారం ఒక్క దగ్గర కేంద్రీకృతం అయితే ఎన్నో ప్రమాదకర పర్యవసానాలకు దారి తీస్తాయి. ఇది ప్రజాస్వామ్యంలో మంచిది కాదు. భారతదేశం వైవిధ్యంతో కూడిన భాషలు, మతాలు, సంస్కృతులు, ప్రాంతీయ అస్తిత్వాలతో కూడుకొని ఉన్నాయి. ఉదాహరణకు మన తెలుగువారు ఐక్యంగా ఉంటేనే తెలంగాణలో ఇంత పెద్ద పోరాటం జరిగింది. తెలుగువాళ్లకే ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర ఇన్ని రకాల వైవిధ్యం ఉంటే, భారత్ భిన్నత్వాల జాతీయతను కలిగివుంది. ఇంకా గమనించాల్సిన విషయమేమిటంటే.. ఉత్తర ఈశాన్యంలో ఎవరైనా ప్రధాన మంత్రి అవుతారా? ఇది సాధ్యమా? దక్షిణ భారతదేశం నుంచి ప్రధానమంత్రి అయ్యే అవకాశం ఉందా? యూపీ, నార్త్, హిందీ అనే మెజార్టీ వాదనలో అధికారమంతా కేంద్రీకృతమైపోతుండటం మనం గమనించాలి. దీని ద్వారా రాజ్యాంగంలో ఒక ప్రధానమైన ఫెడరల్ లక్షణానికి విఘాతం ఏర్పడుతుంది. అది రాజ్యాంగ విరుద్ధం. కాబట్టి వారు కచ్చితంగా సుప్రీంకోర్టుకు వెళతారు. ఫెడరల్ వ్యవస్థ భారత రాజ్యాంగ ప్రాథమిక స్వరూపం. కేశవానంద భారతి తీర్పు ప్రకారం రాజ్యాంగ స్వరూపాన్ని మార్చడం పార్లమెంట్‌కు కూడా సాధ్యం కాదు. వన్ నేషన్, వన్ లాంగ్వేజ్, వన్ రెలీజియన్, వన్ ఎలక్షన్.. ఇవన్నీ రాజ్యాంగ విరుద్ధం. పైవన్నీ రాజ్యాంగ పరమైన అవరోధనలు. ఇక ప్రాక్టికల్‌గా ఉద్భవించే సమస్యలేంటంటే 28 రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు జరిగినప్పుడు రెండు మూడు సంవత్సరాల తర్వాత ఐదు రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు మెజార్టీ కోల్పోయినప్పుడు ఏం చేయాలి? అప్పుడు మళ్లీ దేశం మొత్తం ఎలక్షన్ నిర్వహిద్దామా? లేదా రాష్ట్రపతి పాలన పెట్టి అక్కడి ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా పాలన సాగిద్దామా? అప్పుడు ఖర్చులు తడిపి మోపెడు అవ్వవా? లేక కేంద్రంలోనే ప్రభుత్వం కూలినప్పుడు అన్ని పార్టీల ప్రభుత్వాల ఏర్పాటులో భాగంగా ఇప్పుడున్న ప్రధాని ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌ను నిత్యం చైనా, పాకిస్తాన్ ప్రతినిధివని, ఉగ్రవాదివని విమర్శించే వ్యక్తితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారా? ఇటువంటి అనేక సాంకేతిక సమస్యలు ఎదురవుతాయి. వీటన్నింటికి కొత్త చట్టాల్లో పరిష్కారం చూపుతారా?

# బంగ్లాదేశ్‌ను తేలిగ్గా తీసుకోవద్దు!



టీమ్ ఇండియా తెల్ల దుస్తుల్లో క్రికెట్ ఆడబోతోంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2023-25లో భాగంగా బంగ్లాదేశ్‌తో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఇవ్వాల్టి నుంచి చెన్నై చేపాక్ స్టేడియంలో తొలి టెస్టు ప్రారంభం కానుంది. భారత క్రికెట్ జట్టు ఈ ఏడాది మార్చిలో చివరిసారి టెస్ట్ క్రికెట్ ఆడింది. ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను 4-1 తేడాతో గెలిచింది. మళ్లీ ఆరు నెలల తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌లో క్రికెట్ ఆడబోతోంది. ఈ మధ్య కాలంతో భారత క్రికెట్ జట్టు పొట్టి క్రికెట్ ఎక్కువగా ఆడింది. టీ20 వరల్డ్ కప్‌తో పాటు శ్రీలంక, జింబాబ్వేలతో సిరీస్ ఆడింది. ఇక బంగ్లాదేశ్ జట్టు ఇటీవల చారిత్రాత్మక విజయం సాధించింది. పాకిస్తాన్‌తో పాకిస్తాన్‌లో జరిగిన టెస్టు సిరీస్‌ను 2-0 తేడాతో విజయం సాధించింది.

బంగ్లాకు చెందిన నహిద్ రాణా సరికొత్త పేస్ బౌలింగ్ సెన్సేషన్‌గా మారాడు. పాకిస్తాన్ సిరీస్‌లో అతడు అద్భుతంగా రాణించాడు. బంగ్లా బ్యాటింగ్ లైనప్ కూడా బలంగా కనపడతోంది. ముష్ఫకీర్ రహీమ్, లిటన్ దాస్ మంచి ఫామ్‌లో ఉన్నారు. కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ షంతో ఫామ్‌లో లేకపోవడమే ఆందోళనపరుస్తోంది. అయితే తమదైన రోజున బంగ్లాదేశ్ జట్టు సంచలనాలు సృష్టించగలదు. భారత జట్టులోకి బుమ్రా తిరిగి వచ్చాడు. ఇది బౌలింగ్ లైనప్‌కు అదనపు బలం. కేఎల్ రాహుల్‌ను మిడిల్ ఆర్డర్‌లో ఆడించే అవకాశం ఉంది. భారత్ పూర్తి స్థాయి జట్టుతో ఆడనుంది. ప్రస్తుతం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో టాప్ పొజిషన్‌లో ఉంది. బంగ్లాదేశ్ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసి టాప్ పొజిషన్‌ను స్ట్రాంగ్ చేసుకోవాలని చూస్తోంది. గంభీర్ కోచ్‌గా ఇది తొలి టెస్ట్ మ్యాచ్ 9.30కి ప్రారంభం.

(Live Streaming Jio Cinema, Live Telecast Sports 18)


- భాయ్‌జాన్

# డాక్టర్ పాలిశెట్టికి యునైటెడ్ ఎన్జీవో ఘన సత్కారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జెసిఐ సేనేటర్ డాక్టర్ పాలిశెట్టి మధుబాబుకు యునైటెడ్‌ఎన్జీవో మణికంఠ ఆధ్వర్యంలో స్థానిక 99స్క్వేర్ హోటల్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మధుబాబు అనేక సామాజిక సేవా, అన్నదాన కార్యక్రమాలకు విరాళాలు ఇచ్చి శ్రీకాకుళంలో అగ్రగామిగా నిలిచారన్నారు. డాక్టరేట్ అందుకోవడం నిజంగా అర్హత కలిగిన వ్యక్తని ఈ స్ఫూర్తితో ఎంతో మంది సేవ చేయాలని సూచించారు. మధుబాబు మాట్లాడుతూ డేస్ప్రింగ్ యూనివర్సిటీ ద్వారా బిహెచ్‌ఆర్ఎస్ కొంత మందిలో తనను సెలెక్ట్ చేసి గౌరవించడం గర్వించదగ్గ విషయమన్నారు. దీనికి కారణమైన న్యూ బ్లడ్ బ్యాంక్ వ్యవస్థాపకులు మణికంఠకు కృతజ్ఞతలు కార్యక్రమంలో ఎన్జీవో పెద్దలు జోగి నాయుడు, సాయిబాబా, జయశ్రీరామ్, డాక్టర్ ప్రభు, సాయి, రాజశేఖర్, నటుకుల మోహన్, సురంగి మోహన్ రావు, జామి భీమశంకర్ సంతోష్ దూసి, మణిశర్మ, కళావతి ముత్యాలరావు, మాట్లాడుతూ మధుబాబు సేవలను కొనియాడారు. మధుబాబు కుటుంబ సభ్యులు పలు స్వచ్ఛంద సంస్థల అధినేతలు పాల్గొన్నారు.





# జానీ మాస్టర్ అరెస్ట్..!

స్టార్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ బాషాపై లైంగిక వేధింపుల కేసు నమోదు కావడం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో దుమారం రేపుతోంది. ఇటీవల అతడిపై పోక్సో నమోదు చేసిన నార్సింగ్ పోలీసులు.. తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. నెల్లూరులో ఉన్నాడని జోరుగా ప్రచారం జరగడంతో అక్కడి పోలీసులను సంప్రదించారు. కానీ ఆ తర్వాత అక్కడ లేడని తెలుసుకున్నారు. అయితే పరారీలో ఉన్న జానీ మాస్టర్ ను తాజాగా బెంగళూరులో ఉన్నట్టు గుర్తించారు పోలీసులు. సిటీలో ఉన్న అతడిని గురువారం ఉదయం అదుపులోకి పోలీసులు తీసుకున్నారు. సైబరాబాద్ ఎస్ వోటీ పోలీసులు అతడిని ప్రస్తుతం హైదరాబాద్ తీసుకొస్తున్నారు. ఆ తర్వాత నేరుగా ఉప్పర్ పల్లి కోర్టులో హాజరుపరచనట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి జ్యుడిషియల్ కస్టడీకి తరలించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.



### అసలు ఏం జరిగిందంటే

ఓ మహిళా కొరియోగ్రాఫర్.. తనపై పలుమార్లు జానీ మాస్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడంటూ రాయదుర్గం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. జీరో ఎఫ్ ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. నార్సింగ్ స్టేషన్ కు కేసు తరలించారు. అక్కడి పోలీసులు.. పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. మైనర్ గా ఉన్న టైమ్ లో కూడా అత్యాచారం చేశాడని బాధితురాలు పేర్కొనడంతో.. పోలీసులు పోక్సో కేసు కూడా నమోదు చేశారు. ఇప్పుడు అరెస్ట్ చేశారు. అయితే బాధితురాలు ఫిర్యాదులో కీలక విషయాలు వెల్లడించింది. 2017లో జానీ మాస్టర్ తనకు పరిచయమయ్యాడని తెలిపింది 2019లో అతడి టీమ్ లో అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ గా చేరానని చెప్పింది. ఓ సారి ముంబైలో మూవీ షూటింగ్ కోసం వెళ్లగా.. హోటల్‌లో తనపై జానీ మాస్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపించింది. ఆ విషయాన్ని ఎవరికైనా చెబితే ఇక సినీ ఇండస్ట్రీలో ఎప్పటికీ వర్క్ చేయని విధంగా చేస్తానని బెదిరించినట్లు తెలిపింది. ఆ తర్వాత హైదరాబాద్ సహ పలు ప్రాంతాల్లో పలుమార్లు అత్యాచారానికి ఒడిగట్టాడని ఆరోపణలు చేసింది. వ్యానిటీ వ్యాన్ లో అసభ్యంగా ప్రవర్తించేవాడని పేర్కొంది. ఒకసారి తనపై దాడి కూడా చేశాడని ఆరోపించింది. మతం మారి, పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తీసుకురాగా, అతడి టీమ్ నుంచి బయటకొచ్చేశానని తెలిపింది. ఆ తర్వాత అనేక విధాలుగా ఇబ్బంది పెట్టారని చెప్పింది. రీసెంట్ గా కొన్ని రోజుల క్రితం తన ఇంటి ముందు ఏదో పార్సిల్ ఎవరో వేలాడ దీశారని పేర్కొంది. మరి ఈ వ్యవహారంలో చివరకు ఏం జరుగుతుందో చూడాలి.

- - తుపాకి.కామ్ సౌజన్యంతో...

# గప్ చుప్‌గా ప్రభాస్ సినిమా

ప్రభాస్ - హను రాఘవపూడి కాంబోలో ఓ సినిమా ఇటీవలే లాంఛనంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. మైత్రీ మూవీస్ సంస్థ ఈచిత్రాన్ని నిర్మిస్తోంది. బుధవారం నుంచే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. మధురైలో కొన్ని కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. అయితే ప్రభాస్ మాత్రం సెట్‌లో లేడు. ఆయన ప్రస్తుతం 'రాజాసాబ్తో' బిజీగా ఉన్నారు. 'రాజాసాబ్' షెడ్యూల్ పూర్తయిన తరవాతే ప్రభాస్ హను సినిమా సెట్లోకి అడుగు పెడతారు. మధురై షెడ్యూల్ లో ప్రభాస్ పై తెరకెక్కించే సన్నివేశాలేం లేవని సమాచారం. ఓ వారం రోజుల పాటు చిత్రబృందం మధురైలోనే ఉంటుంది. 1945 నేపథ్యంలో సాగే కథ ఇదని సమాచారం. ఈచిత్రానికి 'ఫౌజీ' అనే టైటిల్ పరిశీలిస్తున్నారు. దాన్నే అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. ప్రభాస్ పై చిత్రబృందం ఇది వరకే ఓ ఫొటో షూట్ నిర్వహించింది. చిన్న గ్లింప్స్ కూడా డిజైన్ చేసింది. దసరాకు విడుదల చేసే అవకాశం ఉంది. ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి ఓ కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన ప్రభాస్ కు తండ్రి పాత్రలో కనిపించనున్నారు. ఇమాన్వీ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ స్వరాలు సమకూరుస్తున్నారు. కె.కె సాహిత్యాన్ని అందించారు. ఇప్పటికే రెండు పాటల్ని రికార్డ్ చేసినట్టు సమాచారం. - తెలుగు 360.కామ్ సౌజన్యంతో...




ప్రముఖ టాలీవుడ్ కొరియోగ్రాఫర్‌పై లైంగిక వేధింపుల కేసు టాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే. 21 ఏళ్ల అతడి సహాయకురాలు ఆరోపణలు చేయడంతో నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఆరోపణలపై పలువురు టాలీవుడ్ ప్రముఖులు స్పందించారు. పలువురు సోషల్ మీడియా ద్వారా బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నటి పూనమ్ కౌర్, గాయని చిన్మయి, ఇతర టాలీవుడ్ తారలు బాధితురాలికి మద్దతుగా నిలిచారు. తాజాగా నటి కం యాంకర్ అనసూయ కూడా బాధితురాలికి సంఘీభావం తెలుపుతూ.. జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ వివాదంపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. మహిళలకు సానుభూతి అవసరం లేదు. అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం వారికి ఉండాలి. మీకు లేదా మీకు తెలిసిన వారికి అలాంటి వేధింపులు ఎదురైతే మాట్లాడండి. మీకు మద్దతు లభిస్తుంది. నేను బాధితురాలితో కలిసి పనిచేశాను. పుష్ప సెట్స్‌లో ఆమెను రెండు మూడు సార్లు చూశాను, చాలా ప్రతిభావంతురాలు. ఈ పరిస్థితి ఆమె సామర్థ్యాన్ని తగ్గించలేదు. అయితే మౌనంగా బాధపడటం వల్ల ప్రయోజనం ఉండదు. నా కార్యాలయంలో ఎవరైనా అలాంటి సవాళ్లను ఎదుర్కొంటే, నేను ఎల్లప్పుడూ స్పందిస్తాను. ఈ కేసులో బాధితురాలికి న్యాయం జరుగుతుందని నేను నమ్ముతున్నాను. ఫిల్మ్ ఛాంబర్ - డబ్ల్యుసీ సభ్యులకు నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. పరిశ్రమలో ఏ స్త్రీకి మళ్లీ ఇలాంటి పరిస్థితి రాకూడదని ఆశిస్తున్నాను.. అని అనసూయ రాశారు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

# ఆమెకు అనసూయ మద్దతు





# పార్టీ మార్పా? రాజకీయ రిటైర్మెంటా?

పార్టీ 2021 అక్టోబర్ రెండో వారంలో ఒక ఉదయం 7 గంటలప్పుడు ఒక యువ కాంగ్రెస్ నేతకు బాలినేని నుంచి 12 ఫోన్ కాల్స్. మన పిల్లోడివి నువ్వు టీడీపీలోకి పోవద్దంటూ బుజ్జగింపుతో మొదలుపెట్టి బెదిరించే వరకు. నేను ఫోన్ చేస్తే చాలు అతను ఆగిపోతాడు అనుకున్న బాలినేనికి అతను కూల్‌గా ఇచ్చిన సమాధానం చిర్రెత్తించింది. కోపంతో ఫోన్ కట్ చేయటం, మళ్లీ 5 నిమిషాలకు ఫోన్ చేయటం, మొత్తం పన్నెండుసార్లు కాల్ చేశారు. చివరి కాల్‌లో మాత్రం కాంగ్రెస్‌తో ఉండి విమర్శ చేసినా సీరియస్‌గా తీసుకోలేదు కానీ పచ్చ కండువా కప్పుకొని విమర్శ చేస్తే చూస్తూ ఊరుకోను అని బెదిరింపు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటివి చాలా జరిగాయి.

సబ్జెక్టు ఉన్నవాళ్లను, మీడియాలో మంచి ప్రెజెన్స్ ఉన్నవాళ్లను పట్టించుకోవాలన్న ఆలోచన వైకాపా చేయలేదు. మీడియా అవసరం ఉందని కానీ, బాగా మాట్లాడేవాళ్ల అవసరం ఉందని కానీ వైకాపా అనుకోలేదు. ప్రతిపక్షంలో ఏ స్క్రిప్ట్ లేకుండా స్వేచ్ఛగా స్వచ్ఛంగా మాట్లాడిన జగన్‌కు అధికారంలోకి వచ్చిన తర్వాత స్క్రిప్ట్ చూసి చదివే పరిస్థితి వచ్చింది. అయినా కానీ ఆ స్క్రిప్ట్ సరిగా రాయలేకపోయారు. ఆ స్క్రిప్టు రాసిన మనిషి జూన్ 4 మధ్యాన్నం నుంచి జగన్ కోర్ టీమ్ ఫోన్ ఎత్తటం మానేశారు. సరే మళ్లీ మొదటికి వస్తే, ఆ కాంగ్రెస్ యువనేత పార్టీ మారుతున్నాడు, మీరు ప్రయత్నం చేయండి అని నేను సన్నిహితంగా ఉన్న ఒకరికి (సీఎంను రోజు కలిసే మంచి పదవిలో ఉన్నారు అప్పుడు) చెబితే.. ఏమైతది అతనితో? ఎన్ని ఓట్లు ప్రభావితం చేస్తాడు? అని పుల్లవిరిచారు.

అధికారంలో ఉన్నంతకాలం సబ్జెక్టు ఉన్నవాళ్లు అవసరం అని కానీ, చేస్తున్న అభివృద్ధి పనులను సాక్షి తరహాలో తూతూ మంత్రంగా రాయటం కాకుండా మరో రకమైన అంటే ప్రొఫెషనల్ పద్ధతిలో ప్రజలకు చేరే విధంగా ప్రచారం అవసరం అని వైకాపాలో అధికార నిచ్చెన పైమెట్టు నుంచి కిందమెట్టు వరకూ ఉన్న ఏఒక్కరూ గుర్తించలేదు. ఆ దిశగా సూచనలు చేసిన వారిని పట్టించుకోలేదు. రోజువారి పని, మొక్కుబడి పనితో గడిపేశారు. మీ జిల్లా పిల్లోడు టీడీపీలోకి పోతుంటే నువ్వు ఏమి చేస్తున్నావ్ అని జగన్ బాలినేని మీద కోప్పడితే అప్పుడు ఫోన్ చేసాడు.. అప్పటి వరకు అతని పేరు కూడా బాలినేనికి తెలియదు. సదరు యువనేత వైకాపాలో ఉండగా ఒక సందర్భంలో పైన చెప్పిన స్క్రిప్ట్ రైటర్ వద్దకు ఫ్లవర్ బొకే తీసుకొని వెళితే నువ్వు ఎవడివి మీడియాలో మాట్లాడటానికి అంటూ అందరి ముందే బొకేను నేలకేసి కొట్టాడు. ఆ యువ నేత నేను ఎవరో ప్రూవ్ చేసుకుంటానని నాడు అధికారంలో ఉన్న టీడీపీ వాళ్లు ఆహ్వానించినా కాదని ఏమి లేని కాంగ్రెస్‌లో చేరి భారీ గుర్తింపు తెచ్చుకున్నాడు. 2021లో అధికార వైకాపా పిలిచినా వద్దనుకొని టీడీపీ ఆహ్వానంతో అంటే ప్రతిపక్షంలోకి వెళ్లాడు. బాలినేని రాజీనామా ఇప్పుడు ప్రజలు ఎక్స్‌పెక్టింగ్ మోస్ట్ అనెక్స్‌పెక్టెడ్ థింగ్స్ అంటే ప్రజల ఊహకు అందనిది ఏది లేదు. అలాంటిది అందరూ అనుకున్నదే జరిగినప్పుడు ఆశ్చర్యపోయేది ఏమి ఉండదు.

బాలినేని శ్రీనివాస్ రెడ్డి నిన్న వైకాపాకు రాజీనామా చేశారు. రెండుసార్లు ముహూర్తాలు పెట్టుకున్నా కుదరలేదు. ఇప్పుడు సెట్ అయ్యింది. బాలినేని జనసేనలో చేరటం కోసం నాగబాబుతో మూడు రోజుల కిందట సమావేశమయ్యారు. ఈరోజో, రేపో పవన్ కళ్యాణ్‌తో అపాయింట్మెంట్ ఉందంట. బాలినేని పోతే ఏమవుతుంది? వైకాపా ప్రకాశం జిల్లాలో మరో పెద్ద తలకాయను వెతుక్కోవాలి. బాలినేనితో సహా అందరూ వ్యతిరేకించినా చంద్రగిరి నుంచి రెండు జిల్లాలు దాటించి చెవిరెడ్డి భాస్కర రెడ్డికి ఒంగోలు ఎంపీ టికెట్ ఇచ్చారు. ఈసారి కూడా ఆయనకే ప్రకాశం జిల్లా అధ్యక్ష పదవి ఇస్తారని ప్రచారం జరిగింది. జిల్లా అధ్యక్ష పదవి ఆ జిల్లా నేతకే ఇవ్వాలని ఏమి లేదు. ప్రాంతీయ పార్టీలో అధినేత ఏది అనుకుంటే అదే ఫైనల్.

బాలినేని పార్టీ వీడటం వైకాపాకు ఓట్లపరంగా పెద్ద నష్టం ఏమి ఉండదు కానీ ఇంతకాలం పార్టీని నడిపిన నేత కాబట్టి ఒక వాక్యూమ్ ఏర్పడుతుంది. బాలినేని ఏ రోజు ఇతర నియోజకవర్గాలలో ప్రజల వద్దకు వెళ్లినవాడు కాదు. ఆయన ఎక్కడ కూర్చుంటే అక్కడికే పార్టీ నాయకులు వెళ్లేవారు. ప్రజలకు సంబంధం ఉండేది కాదు. బాలినేనిని మా నేత అని ప్రకాశం జిల్లా ప్రజలు అనుకోరు. బాలినేని అడ్డుకోవటం వలనే మార్కాపురం జిల్లా కాకుండా పోయింది అనే భావిస్తారు. బాలినేని తన ఒంగోలుకు తాగునీరు తీసుకొని పోవటంపై పెట్టిన శ్రద్ధ వెలిగొండ ప్రాజెక్ట్ మీద కూడా పెడితే అది 2023 జూన్ నాటికే పూర్తయ్యేదనే భావం ఉంది. స్థానిక మంత్రి (వెలిగొండ ప్రాజెక్ట్ టన్నెల్స్ యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోకే వస్తాయి) మంత్రి సురేష్ మీద కన్నా బాలినేని మీదనే రైతులు కోప్పడతారు. పదవి ఉన్నా పదవి లేకున్నా బాలినేని కానీ సురేష్ కానీ జిల్లాకు చేసింది ఏమీలేదనే విమర్శ ఇద్దరి మీద ఉంది.

### ఇంకా ఎవరు పోతారు?

ప్రకాశం జిల్లాలో వైకాపా గెలిచిన దర్శి – బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, యర్రగొండపాలెం తాటిపర్తి చంద్రశేఖర్ ఇద్దరూ బాలినేని అనుచరులే. వీరిలో చంద్రశేఖర్‌ను పార్టీలోకి తీసుకొచ్చింది. ఛానల్స్‌కు డిబేట్లకు పంపింది, యర్రగొండపాలెం సీట్ ఇప్పించింది బాలినేనినే. బాలినేని, చంద్రశేఖర్‌కు టికెట్ ఇప్పించారు. కానీ యూత్ కాంగ్రెస్ నుంచి తనకు మిత్రుడు అయినా కాకుమాను రాజశేఖర్‌కు ఎమ్మెల్యే టికెట్ దక్కలేదు. సంతనూతలపాడు, కొండపి & యర్రగొండపాలెం మూడు ఎస్సీ స్థానాలు ఉన్నా కాకుమాను రాజశేఖర్‌కు టికెట్ రాకపోవటంలో బాలినేని వైఫల్యం కూడా ఉంది. బూచేపల్లికి భవిష్యత్తు మీద ఆశలు ఉండొచ్చు. పార్టీ మారటం మీద తొందరపడకపోవచ్చు కానీ చంద్రశేఖర్ బాలినేని మాటే భగవద్గీత అనుకోవచ్చు. ముందు అనుచరులను పంపి వాటర్ టెస్ట్ చేసుకునే అలవాటు ఉన్న బాలినేని ఎన్నికల తర్వాత ఒంగోలు మేయర్‌ను టీడీపీలోకి పంపారు అనే అంటారు. ఒంగోలు కార్పొరేటర్లలో ఇద్దరు ముగ్గురు తప్ప మిగిలిన వాళ్లు అందరూ బాలినేనితోనే ప్రయాణం చేస్తారు.

పార్టీ మార్పా? రాజకీయ రిటైర్మెంటా? నా ఉద్దేశ్యంలో జగన్ మీద ఉన్న కోపంతోనే బాలినేని పార్టీ మారుతున్నారు. కానీ కొత్తపార్టీలో యాక్టివ్‌గా ఉండే అవకాశం లేదు. బాలినేని మనస్తత్వానికి విపరీతమైన గౌరవం కోరుకుంటాడు, అమర్యాద కాదు కదా తగిన మర్యాద దక్కకున్నా తట్టుకోలేడు. కొత్త పార్టీ అంటే అత్తగారిల్లే.. కొత్త కోడలే సర్దుకొని పోవాలని అనుకుంటారు. కానీ వాళ్లు శ్రద్ధపెట్టి మర్యాదలు చేయరు. జనసేనలో చేరితే పవన కళ్యాణ్‌ను కలవటం అన్నిసార్లు సాధ్యం కాదు, నాదెండ్ల మనోహర్ లాంటి నేతలతో పని చెయ్యటం బాలినేనికి మనస్కరిస్తుందా? బాలినేనిని జనసేనలో చేర్చుకోకుండా పవన్ కళ్యాన్తో మాట్లాడండి అని టీడీపీ మంత్రి ఒకరు చంద్రబాబు వద్దకు వెళ్లారు. దానికి అది వాళ్ల ఇష్టం అని తేల్చిచెప్పారు. ఎన్నికల ముందే జనసేనలోకి వెళ్లటానికి సిద్ధం అయిన బాలినేని కుటుంబ సభ్యుల ఒత్తిడితో ఆగిపోయారు. బాలినేని జనసేనలోకి వస్తే ఒంగోలు టికెట్ ఇచ్చి దామచర్ల జనార్ధన్‌కు కందుకూర్ టికెట్ ఇచ్చేలా ఒక సర్వే కూడా జరిగింది. అది కుదరని పక్షంలో బాలినేని గిద్దలూరు టికెట్ ఇచ్చే ఆలోచన కూడా చేశారు. 1999 కాంగ్రెస్ టికెట్ నాటి మున్సిపల్ చైర్మన్ మంత్రి శ్రీనుకు రావలసింది కానీ వైఎస్సార్ ఆశీస్సులతో బాలినేని దక్కింది. చంద్రబాబు తటస్థుల ప్రయోగంతో సిట్టింగ్ ఎమ్మెల్యే ఈదర హరిబాబును కాదని వైశ్య సామాజిక వర్గానికి చెందిన యక్కలి తులసీరావుకు సీట్ ఇచ్చారు, హరిబాబు రెబల్‌గా వేసి 25వేల ఓట్లు చీల్చటంతో బాలినేని కేవలం 6వేల ఓట్ల తేడాతో గెలిచారు. అప్పటి నుంచి కాంగ్రెస్, వైకాపా పార్టీ గెలిచిన 2004, 2009, 2019లో గెలిచి వైకాపా ఓడిపోయిన 2014, 2024లో ఓడిపోయినా (2012 ఉప ఎన్నికకు ప్రాధాన్యత లేదు) బాలినేని మరోసారి పోటీ చేస్తారా? 2024 ఓటమే చివరి ఎన్నిక అవుతుందా? నా ఉద్దేశంలో బాలినేని కొత్తపార్టీలో చేరి సైలెంట్ అయిపోతారు. కొద్దికాలం తర్వాత బాలినేని కొడుకు ప్రణీత్ రెడ్డి, మా తండ్రి రాజకీయాలతో నాకు సంబంధం లేదు నేను జగన్‌తోనే నడుస్తాను అని ప్రకటించి 2029 ఒంగోలు టికెట్ రేసులోకి రావొచ్చు.

**- శివ రాచర్ల**

## ఆడవరంలో బోయి భీమన్న జయంతి

(సత్యంన్యూస్, గార)

ఆడవరం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు భోగెల ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రముఖ కవి బోయి భీమన్న జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదో తర గతి తెలుగు తోటలో ఉన్న పాఠ్యాంశం బోయి భీమన్న రచించిన మహ నీయుడు అంబేద్కర్ గురించి జయగీతం జయ జయ అంబేద్కర గీతాన్ని ప్రధానోపాధ్యాయులు విద్యార్థులతో పాటు ఆలపించారు. కవి బోయి భీమన్నకు, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్‌గా ఉర్లాపు యోధ వేషధారణ ఎంతగానో ఆకట్టుకుంది.



## కేన్సర్ బాధితునికి డాక్టర్ సింధూర సాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సేవలకు ధనం అవసరంలేదని, సమయాన్ని కేటాయిస్తే చాలని ప్రముఖ వైద్యులు, లైన్స్ క్లబ్ సెంట్రల్ సెక్రటరీ డాక్టర్ సింధూర అన్నారు. అంపోలుకు చెందిన ఉట్ల హేమంత్‌కుమార్ గత కొంత కాలంగా కేన్సర్‌తో పోరాటం చేస్తున్న విషయం విదితమే. గురువారం అత్యవసర పరిస్థితిలో ఒక ఇంజక్షన్ ఎక్కించాల్సి ఉందని హేమంత్ తెలపగా అందించామన్నారు. హేమంత్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని గమనించి లైన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ తరఫున, సింధూర హాస్పిటల్ తరఫున అండగా ఉంటామన్నారు. హేమంత్ అనారోగ్య కారణంగా, కుటుంబ పోషణ కూడా కష్టతరమైందని, సహాయం చేయాలనుకునేవారు ముందుకు వచ్చి హేమంత్ కుటుంబాన్ని ఆదుకుంటే, అతని జీవితంలో ఆనంద వెలుగులు చూడవచ్చన్నారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సెక్రటరీ, సింధూర హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పైడి సింధూర, మార్కెటింగ్ చైర్‌పర్సన్ ఉర్లం శివతేజ, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ఉమా శంకర్, సింధూర హాస్పిటల్ టెక్నీషియన్స్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## పీవోడబ్ల్యూ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ నెల 27న ఇల్లీసిపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో జరగబోయే ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) శ్రీకాకుళం జిల్లా 7వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ పిలుపునిచ్చారు. మహిళలపై సాగుతున్న హత్యలు, అత్యాచారాలు, పీడనలు, వివక్షతలు, శ్రమ దోపిడికి వ్యతిరేకంగా పోరాడుదామన్నారు. గ్రామంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా మహాసభల కరపత్రాన్ని మహిళా కార్యకర్తలతో కలిసి ఆమె ఆవిష్కరించారు. జిల్లా నలుమూలల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా నాయకులు హేమక్క, కె.జానకమ్మ, కె.సావిత్రమ్మ, పుణ్యవతి, పి.సరస్వతి జానకమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పల్లకిలో ఊరేగింపు.. నాగావళి నదిలో నిమజ్జనం

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

జాతి ఐక్యతకు నిదర్శనం గణేశ ఉత్సవాలని, సనాతన వైదిక ధర్మం కాపాడే బాధ్యత అందరిపై ఉందని శ్రీకాకుళం జిల్లా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ట్రస్ట్ కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి శాసపు జోగినాయుడు అన్నారు. న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో డే అండ్ నైట్ జంక్షన్‌లో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని బుధవారం సాయంత్రం వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి నగర పురవీధుల్లో ఊరేగించి నాగావళి నదిలో నిమజ్జనం చేశారు. సనాతన సంప్రదాయం ప్రకారం గణనాథుని సంప్రదాయ పల్లకి మీద పెట్టి పాలకొండ రోడ్డు మార్గం ద్వారా ఏడురోడ్ల కూడలి మీదుగా ఉమా రుద్రకోటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఉన్న నాగావళి నదిలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనం జరిపారు. ఆధ్యాత్మక శోభ వెల్లివిరిసేలా మేళతాళాల నడుమ, తప్పెటగుల్లు, సన్నాయిమేళం, వాయిద్యాలతో కమిటీ సభ్యుల కోలాహలం మధ్య ఆద్యంతం కమనీయం, రమణీయంగా జరిగింది. ఎటువంటి శబ్ద కాలుష్యం లేకుండా మట్టి వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. న్యూ శ్రీకాకుళం బ్లడ్‌బ్యాంక్ ప్రతినిధులు డాక్టర్ టి.మణికంత, వివిధ స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు మణిశర్మ, జైశ్రీరామ్, పొన్నాడ రాజశేఖర్, మీడియా సభ్యులు సాయి, రాము, రాజేష్ తదితరులు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు.



## రాజారావు మాస్టారికి జుట్టు ట్రస్ట్ పురస్కారం

(సత్యంన్యూస్, పొందూరు)

మన్యం పార్వతీపురం జిల్లా తోటపల్లిలో జుట్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'మనబడి–మనతోట' (ప్రకృతి గీతాలు) పుస్తకావిష్కరణ సందర్భంగా పొందూరుకు చెందిన జిల్లా శ్రీశ్రీ కళా వేదిక ప్రధాన కార్యదర్శి వావిలపల్లి రాజారావు మాస్టారికి సత్కారం జరిగింది. ఈ పుస్తకంలో భాగస్వామ్యం అయిన మాస్టారికి జుట్టు ట్రస్ట్ తరఫున కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారిణి జి.పగడాలమ్మ, జుట్టు ట్రస్ట్ డైరెక్టర్ డి.పారినాయుడు, బాలసాహితీవేత్తలు పాల్గొన్నారు.




## మాజీ సైనికుల కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



మాజీ సైనికులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కార్పొరేషన్ ఏర్పాటుపై బుధవారం క్యాబినెట్ సమావేశంలో ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జిల్లా అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకం వమ్ము కాలేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంపై ఉన్న నమ్మకం హెచ్చిందని, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ యువగళంలో ఇచ్చిన మాట, ఆమదాలవలస నియోజకవర్గంలో ప్రకటించిన విధంగా మాజీ సైనికుల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం చాలా సంతోషదాయకమన్నారు. ఇవన్నింటికి మూల కారణమైన కేంద్రమంత్రి, జిల్లా ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకు మాజీ సైనికులు, వీర నారీమ ణులు, వారి కుటుంబ సభ్యులు ఎప్పుడూ రుణపడి ఉంటారన్నారు. మాజీ సైనికుల కార్పొరేషన్ ఏర్పడడం వల్ల రాష్ట్రంలో మరింత అభివృద్ధి జరిగేందుకు తోడ్పడుతుందని జిల్లా అధ్యక్షులు పూర్ణచంద్రరావు తెలియజేశారు.

## ఐదు న్యాయస్థానాలకు ప్రభుత్వ న్యాయవాదిగా వాన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




జిల్లాలో పలు న్యాయస్థానాలకు ప్రభుత్వ న్యాయవాదిగా సీనియర్ న్యాయవాది వాన కృష్ణచంద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు చేసింది. శ్రీకాకుళం కుటుంబ న్యాయస్థానం ప్రభుత్వ న్యాయవాదిగా రెగ్యులర్ విధులు నిర్వహిస్తూ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు, సోంపేట జిల్లా సెషన్స్ కోర్టు శ్రీకాకుళం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు, 6వ ఎడిషినల్ సెషన్స్ కోర్టులకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కృష్ణచంద్‌కు అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. శ్రీకాకుళం జిల్లాలో ఒకేసారి ఐదు న్యాయ స్థానాలకు ప్రభుత్వం తరఫున న్యాయవాదిగా పనిచేసే అరుదైన అవకాశం కృష్ణచంద్‌కు లభించడం పట్ల శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు వివిధ స్వచ్ఛంద సంస్థల నేతలు ప్రజా సంఘాల నాయకులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసారు.

























# మాకంటే ఎవడు తోపు.. దమ్ముంటే ఆపు!

మొదటిపేజీ తరువాయి

ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైల్వే నిర్మాణాలకు ఇసుక ఇవ్వాలన్నా ఒక ఆర్డర్‌ను పట్టుకొని ఇప్పటికీ నదుల్లో దిగి తవ్వుకుపోతున్నారు. వీరికి అవసరమైన క్వాంటిటీ ఎప్పుడో తరలించేశారని 'సత్యం' కథనం ప్రచురించిన రోజు రాత్రే ఎమ్మెల్యే వీరిద్దర్నీ పిలిచి తన కార్యాలయంలో ఇక చాలు ఆపేయండి అంటూ చెప్పారు. అక్కడికి మూడు రోజులు సైలెంట్ అయిపోయి ఆ తర్వాత మళ్లీ ఇసుక తవ్వుకోవడం మొదలుపెట్టారట. తన నియోజకవర్గంలో అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకోవాలని ఎమ్మెల్యే ఇచ్చిన ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం మూడురోజులు కాపు కాసి చిలకపాలెం పాపారావుకు చెందిన జేసీబీని రెండుసార్లు, భైరికి చెందిన దొండపాటి ఈశ్వరరావు, మల్లా ఈశ్వరరావు తెప్పించిన లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో రెండు రోజుల పాటు ఇసుక అక్రమ రవాణాను నిలిపేసిన చల్లా వాసు, అబ్బాయి నాయుడు రెండు రోజుల నుంచి మళ్లీ అక్రమంగా ఇసుకను తవ్వి లారీల్లో విశాఖకు తరలించడం ప్రారంభించారని తెలుస్తుంది. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకొనేందుకు సింగుపురం అడ్డురోడ్, భైరి, కరజాడ అండర్ పాసేజ్ వద్ద ఉంటున్న రెవెన్యూ, పోలీస్‌లను మేనేజ్ చేసి ఇసుకను లారీల్లో సరిహద్దులు దాటిస్తున్నారట.

శ్రీకాకుళం రూరల్ మండలం పరిధిలో భైరి, గార మండలం బూరవల్లి నుంచి ఇసుకను విశాఖకు తరలించడం వెనుక గనుల శాఖ అధికారుల జోక్యం ఉందని విశ్వసనీయ సమాచారం. టీడీపీ నాయకులుగా చలామణి అవుతున్న చల్లా వాసు, మల్లా అబ్బాయి నాయుడు రైల్వే ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ కోసం జిల్లాలో పూండి, నౌపడ, కోటబొమ్మాళి, తిలారు, దూసి, పొందూరు రైల్వేస్టేషన్లలో భవనాల నిర్మాణం కోసం కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌ను చూపించి నదుల్లో తవ్వేస్తూ, లారీల్లో ఇసుకను జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు.



బూరవిల్లి నుంచి అర్ధరాత్రి తరలిపోతున్న ఇసుక

శాంతి కన్‌స్ట్రక్షన్ పేరుతో కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌ను చల్లా వాసు, అబ్బాయినాయుడు సొంతానికి వినియోగిస్తున్నారు. కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌లో గార మండలం అంబళ్లవలస నుంచి 457 మెట్రిక్ టన్నులు, బూరవల్లి నుంచి 43 మెట్రిక్ టన్నులు మొత్తం 500 మెట్రిక్ టన్నులకు మాత్రమే అనుమతిచ్చారు. దీన్ని చల్లా వాసు, అబ్బాయినాయుడు సొంతం కోసం వినియోగించుకొని ఒక్కో లారీని రూ. 50వేలకు ఇసుక రీచ్ వద్ద విక్రయిస్తున్నారు. జిల్లాలోని పొందూరు, పలాస, పూండి తదితర ప్రాంతాల పేరుతో 20 టన్నుల లారీకి రూ. 6,800కు బిల్లు ఇస్తున్నారు. జాతీయ రహదారిపైకి వచ్చిన తర్వాత ఎక్కడైనా పోలీసులు, రెవెన్యూ అధికారులు అడ్డుకుంటే శాంతి కన్‌స్ట్రక్షన్ పేరుతో కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్‌ను కొన్ని సార్లు, ఒడిశా నుంచి లోడ్ చేయించి తెస్తున్నట్టు బిల్లులు చూపించి వెళ్లిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.


### విశాఖ నుంచి ఆర్డర్స్

భైరిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణా చేస్తున్న వారంతా మూడు గ్రూపులుగా విడిపోయారు. టీడీపీలో శంకర్, గుండ లక్ష్మీదేవి వర్గాలు ఉండగా వైకాపా ఒక వర్గంగా మారింది. మొత్తం మూడు వర్గాల్లో రెండు వర్గాలుగా మారిన టీడీపీ నాయకులు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. వైకాపా వర్గం అవకాశం కోసం ఎదురుచూస్తుంది. దీన్ని ఆసరాగా చేసుకొని ప్రభుత్వంలో పెద్దల పేరు చెప్పి దొండపాటి ఈశ్వరరావు, మల్లా ఈశ్వరరావు కలిసి భైరిలో ఇసుక అక్రమరవాణాకు తెరలేపారు. దీనిపై గ్రామస్తులు కొందరు ఆర్డీవోకు ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు అడ్డుకొని లారీలను అక్కడి నుంచి పంపించేశారు. అనుమతులు లేకుంగా ఇసుక తరలించడం కోసం విశాఖ నుంచి లారీలు రోడ్డుపై బారులు తీరి ఉన్నా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ప్రశ్నించడం లేదు.

### రగిలిపోతున్న టీడీపీ కేడర్

గార, శ్రీకాకుళం మండంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నది ఈ నలుగురేనని టీడీపీలో చర్చ సాగుతుంది. ఎమ్మెల్యే వారించినా లెక్క చేయకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేయిస్తుండడంపై టీడీపీ మండల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరికి మాత్రమే ఇసుక తవ్వకాలు, రవాణాకు అవకాశం ఇచ్చి మిగతా వారి చేతులు కట్టేశారని రగిలిపోతున్నారు. ఇసుక అక్రమ రవాణా చేయకుండా అడ్డుకోవాల్సిన రెవెన్యూ సిబ్బందిని చల్లా వాసు, అబ్బాయినాయుడు మేనేజ్‌చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మూడు సిఫ్ట్‌లలో విధుల్లో ఉండాల్సిన రెవెన్యూ సిబ్బంది కేవలం రెండు సిఫ్ట్‌లకే పరిమితమయ్యారు. ఇసుకను అక్రమంగా తరలించేవారు, ఇసుకను తరలించకుండా అడ్డుకుంటున్నవారు అందరూ స్థానికులే కావడం విశేషం.

## బెదిరింపులకు పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలి



(సత్యంన్యూస్, టెక్కలి)

ఏఐసీసీ నేత, పార్లమెంట్లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై బెదిరింపులకు పాల్పడిన వారిని తక్షణం అరెస్ట్ చేయాలని, వారిని శిక్షించాలని టెక్కలిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. స్థానిక ఇందిరా విగ్రహం కూడలి వద్ద వారు నల్లబ్యాడ్లతో నిరసన తెలియజేస్తూ నినాదాలు చేశారు. శివసేన శాసనసభ్యుడు సంజయ్ గైక్వాడ్, ఢిల్లీకి చెందిన బిజెపి నాయకులు త్రివేంద్ర సింగ్ రాహుల్ గాంధీని హెచ్చరించడం, రాహుల్‌గాంధీ నాలుక కోసి తెచ్చిన వారికి 11లక్షలు బహుమతిగా ఇస్తానని ప్రకటించడం తీవ్రమైన విషయాలన్నారు. తక్షణమే వారిని అరెస్ట్ చేయాలని కోరుతూ డిఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, పార్టీ నాయకులు కిల్లి రామ్మోహన్‌రావు, కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ పేడాడ పరమేశ్వర రావు, అన్నాజీ రావు, ఇచ్ఛాపురం, మాసుపత్రి చక్రవర్తి రెడ్డి, కొప్పురోతు వెంకట్రావు, మంత్రి నరసింహ మూర్తి, కరిమజ్జి మల్లేశ్వరరావు, నాయకులు డి.గోవింద మల్లిబాబు, కోత మధుసూదనరావు, ఏ.వెంకటనాయుడు, పొట్నూరు ఆనందరావు,టి.బి.జే గుప్త, మాధవ్,హేమ,కోట.రమణ, రిక్క సూర్య కుమారి, బద్రి సీతమ్మ, పి.సూర్యనారాయణ, డి.వెంకట్రావు, పూడి కిరణ్ ,రమేష్,తదితర పార్టీ నేతలు పాల్గొన్నారు.

## మునకలవలసలో స్వచ్ఛత ప్రతిజ్ఞ



(సత్యంన్యూస్, రాజాం)

ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం లో భాగంగా రేగిడి ఆమదాలవలస మండలం మునకలవలస గ్రామంలో గురువారం స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. స్వచ్ఛమైన, పరిశుభ్రమైన గ్రామాలను నిర్మిద్దాం అని 39 గ్రామ పంచాయతీలలో ప్రతిజ్ఞ చేసినట్లు ఎంపీడీఓ శ్యామలకుమారి, ఈఓపిఆర్‌డి సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మండల కో-ఆర్డినేటర్ పద్మ, సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు తాతన్నాయుడు, పంచాయతీ కార్యదర్శి సుధీర్, ఉపాధ్యాయులు నాగభూషణరావు, బివి రమణమూర్తి, పద్మ, కళ్యాణి, జనార్ధనరావు, వనజాక్షి, సత్యారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులను మినీ రిజర్వాయర్లుగా చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలోని చెరువులను మినీ రిజర్వాయర్లుగా అభివృద్ధి చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీన ఢిల్లీరావు, సంఘం న్యాయసలహాదారు మరియు ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సమాఖ్య అధ్యక్షులు, చౌదరి లక్ష్మణరావు, సంఘం ప్రతినిధి, ధర్మాన వెంకటరమణ, మహిళా విభాగం అధ్యక్షురాలు, బద్రి సీతమ్మ, సంఘం సభ్యులు, కాళ్ల తిరుమలరావు, తలగాన గంగయ్య డిమాండ్ చేశారు. గురువారం పలాసలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారీ సాగునీటి ప్రాజెక్టులు వ్యయ ప్రయాసలతో కూడుకున్నవని, వివాదాలు కూడా తలెత్తే అవకాశాలు ఉన్నాయన్నారు. భారీ ప్రాజెక్టులు నిర్వహణ కూడా కష్టతరమన్నారు. జిల్లా భౌగోళిక, నైసర్గిక స్వరూపం భారీ సాగునీటి ప్రాజెక్టులకు అనుకూలం కాదని గతంలో ఇంజనీరింగ్ నిపుణులు హెచ్చరించారని వారు గుర్తు చేశారు. వంశధార, ఆఫ్ షోర్ వంటి భారీ ప్రాజెక్టులు నేటికీ పూర్తి చేయలేకపోయిన విషయాన్ని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. చెరువులను మినీ రిజర్వాయర్లుగా అభివృద్ధి చేస్తే వరదల నివారణ సాధ్యం అవుతుందన్నారు.



నిరుపేద విద్యార్థికి దత్తత తీసుకున్న

## విశాఖపట్నం కళింగ వైశ్య యువజన సంఘం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అమ్మాయి చదువులలో ముందంజలో వున్న తల్లిదండ్రులకు పై చదువులు చదివించడానికి ఆర్థిక స్తోమత లేక పిల్లలకి ఇంటికే పరిమితం చేద్దాం అనుకున్న సమయంలో సోషల్ మీడియాలో వచ్చిన కథనం ప్రకారం సంఘ సంస్కర్త సకలాభక్తుల రాజారమేష్ పిలుపు మేరకు విశాఖపట్నంలో వున్న కళింగ వైశ్య యువజన సంఘం అధ్యక్షులు తాళాసు సాయిమోహన్ స్పందించి సంఘ సభ్యులకు తెలియజేసి అమ్మాయి చదుల భాధ్యత సంఘం తరుపున తీసుకున్నట్లు రాజా రమేష్ తెలియజేసారు. గత సంవత్సరం పెండింగ్ లో వున్న సుమారు 40 వేలు రూపాయిలు ఫీజు వన్ టైం చెల్లించి విద్యార్ధికి మేము న్నామని ధైర్యం ఇచ్చి చదువు కొనసాగించేలా పూర్తి భాధ్యతలు తీసుకున్న యువజన సంఘానికి పలువురు ప్రశంసలు తెలియజేసారు.





ఆగష్టు 7న ఉత్తమ శాస్త్రవేత్తల పురస్కారాలు అందజేసిన రాష్ట్రపతి

తాము ఎంపిక చేసిన వారి పేర్లు లేవని శాస్త్రవేత్తల అనుమానాలు

నెమ్మదిగా రాజుకుంటున్న నిరసన ధ్వనులు

# అలిగిన భారత శాస్త్రవేత్తలు!

(దుప్పల రవికుమార్)

ప్రపంచంలో సైన్స్ రంగంలో ఇచ్చే అత్యున్నత పురస్కారం నోబుల్ బహుమతి కాగా, మన దేశం వరకు అతి గొప్ప శాస్త్రరంగ పురస్కారంగా భావించేది విజ్ఞాన్ యువ శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు. ఈ ఏడాది భట్నాగర్ పురస్కారానికి ఎంపికైన పేర్లలో మతలబులు ఉన్నాయని పెద్దఎత్తున నిరసన రేగుతోంది. భారతదేశంలో ప్రసిద్ధిచెందిన 26 మంది శాస్త్రవేత్తలు కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగ ముఖ్య కార్యదర్శికి ఈ విషయమై ఒక లేఖ రాశారు. ఈ ఏడాది శాంతిస్వరూప్ భట్నాగర్ పేరిట ఇస్తోన్న అవార్డులలో పైరవీలు జరిగినట్టు, అహేతుకంగా శాస్త్రవేత్తలు కానివారికి పురస్కారాన్ని ప్రకటించినట్టు వస్తోన్న వార్తల నేపథ్యంలో తమకు నిజానిజాలు వివరించాలని డిమాండ్ చేస్తూ వారు రాసిన లేఖలో డిమాండ్ చేశారు. అందులో తమ పేరు వెల్లడించడానికి ఇష్టపడని నలుగురు శాస్త్రవేత్తలు మీడియా ముందుకు వచ్చారు. భౌతిక శాస్త్ర విభాగంలో పురస్కారానికి దేశంలో మేలైన శాస్త్రవేత్తలున్న ఎంపిక కమిటీ సిఫారసు చేసిన మూడు పేర్లలో రెండింటిని జాబితాలోంచి ప్రభుత్వం తొలగించిందని 'స్క్రోల్' పత్రిక ఆరోపించింది. మరో సైన్స్ విభాగంలో మూడో అభ్యర్థిని జాబితా లోంచి తొలగించినట్లు మంగళవారం 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' దినపత్రిక వెల్లడించింది.

### ఎంపిక పద్ధతినే మార్చేసిన ప్రభుత్వం

ప్రముఖ శాస్త్రవేత్త శాంతిస్వరూప్ భట్నాగర్ పేరుమీద నెలకొల్పిన ఈ అవార్డును 1958 నుంచి ఇస్తున్నారు. ఈ పురస్కారాన్ని జీవ, రసాయన, గణిత, భౌతిక శాస్త్రాలు, వైద్యం, ఇంజనీరింగ్, భూ వాతావరణ పరిశోధన, సముద్రం, ప్లానెటరీ సైన్స్ విభాగాలలో ఇస్తుంటారు. ఈ పురస్కారాలను అందజేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వ సైన్స్, టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధీనంలో ఉన్న సిఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్)కు అప్పజెప్పారు. దీనిపేరు మార్చాలని ముందు ప్రభుత్వం భావించింది. శాస్త్రవేత్తల నుంచి గట్టిగా నిరసన ఎదురయ్యేసరికి, పేరు వెనుక శాంతిస్వరూప్ భట్నాగర్ ఉంచారు. గడచిన ఆరు దశాబ్దాలుగా పాటిస్తున్న ఈ పురస్కారాల ఎంపిక సంప్రదాయానికి మోదీ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చినట్టు శాస్త్రవేత్తలు ఆరోపిస్తున్నారు. శాస్త్రవేత్తల కమిటీలు చేసిన సిఫారసులను ప్రభుత్వం ఎంపిక చేయడమనే ఆనవాయితీకి స్వస్తి చెప్పి, తమకు నచ్చినవారికి పురస్కారాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధపడినట్టు తెలుస్తోంది. అలా తొలగించబడిన ఒక పేరున్న శాస్త్రవేత్త మోదీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తుండడమే కారణమని వారు ఆరోపిస్తున్నారు.

కాగా, ఈ అవార్డుల పైన అల్లుకున్న నీలినీడల గురించి పూర్తి సమాచారాన్ని వెల్లడించి తమ అనుమానాలను నివృత్తి చేయాలని ఆగష్టు 30న శాస్త్రవేత్తలు ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇప్పటివరకూ ప్రభుత్వం నుంచి సమాధానం లేదు. ఈ ఏడాది అవార్డు విధివిధానాలను, ఎంపిక పద్ధతిని పూర్తిగా ప్రభుత్వం మార్చేసింది. ముందుగా స్వతంత్రంగా ఉన్న ఈ అవార్డును ఒక సమూహంలో చేర్చింది. మొత్తం శాస్త్ర సాంకేతిక పురస్కారాలను రాష్ట్రీయ విజ్ఞాన పురస్కారాలనే పెద్ద సమూహంగా ఏర్పాటు చేసింది. దానిని విజ్ఞాన రత్న, విజ్ఞానశ్రీ, విజ్ఞాన్ యువ శాంతిస్వరూప్ భట్నాగర్, విజ్ఞాన బృందం అని నాలుగు విభాగాలుగా విడదీసింది. అక్కడితో ఊరుకోకుండా, మరొక అతి ముఖ్యమైన మార్పు చేసింది. అది ఎంపిక విధానాన్ని మార్చింది. గత ఏడాది వరకు ప్రతి విభాగపు సెలక్షన్ కమిటీలోను గతంలో ఈ భట్నాగర్ అవార్డు పొందిన శాస్త్రవేత్తలు ఉండేవారు. ఆరు దశాబ్దాల తర్వాత ఈ ఎంపిక కమిటీలో శాస్త్రవేత్తలను భారీగా కుదించి, వారి స్థానంలో ప్రభుత్వ అధికారులను చేర్చింది. విజేతల వివరాలు వెల్లడించే అధికారం శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి చేతిలో ఉండేట్లు నిబంధనలు సవరించింది.

### భావజాల నియంత్రణలో భాగమే!

ఈ రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కార కమిటీకి చైర్‌పర్సన్‌గా ఆ శాఖ ముఖ్య సాంకేతిక సలహాదారు ఉంటారు. ఈ కమిటీలో వివిధ సైన్స్, ఇంజనీరింగ్ అకాడమీల నుంచి నలుగురు అధ్యక్షులు, ఆరుగురు శాస్త్రవేత్తలు, ఆరుగురు వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. పురస్కార గ్రహీతలను నిర్ణయించే అధికారం మంత్రుల చేతిలో ఉంటుందని తమ వెబ్‌సైట్‌లో ప్రదర్శించకుండా రహస్యంగా ఉంచి, గత వారమే వెల్లడించారు. దాంతో శాస్త్రవేత్తలు ఎంపిక చేసిన పేర్లలో తమకు నచ్చని వ్యక్తుల పేర్లు జాబితాలో గల్లంతయ్యాయి. వారు భారతదేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో చేసిన సేవలకు గుర్తింపుగా అందజేయాల్సిన ఈ అత్యున్నత పురస్కారాలు ఇప్పుడు నవ్వులపాలయ్యాయి. తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారికి, ప్రతిపక్షాలకు సమర్ధనగా మాట్లాడిన వారికి ఇవ్వకూడదనే స్థాయికి దిగజారినట్లు ప్రభుత్వానికి లేఖ రాసిన 26మంది శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ లేఖ సంతకం చేయని మరెంతోమంది శాస్త్రవేత్తలు ప్రభుత్వ నిర్ణయానికి తీవ్రంగా అభ్యంతరం చెప్తున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారం అంతా స్వీడన్ రాజు నోబెల్ బహుమతి గ్రహీతను తిరస్కరించినట్టు కనిపిస్తోందని వారు విస్తుపోతున్నారు.

తాము ప్రతిపాదించిన శాస్త్రవేత్తల పేర్లు జాబితాలో లేకపోవడం వారికి శరాఘాతంగా తగిలింది. ప్రభుత్వం కొందరి పేర్లు ఉద్దేశపూర్వకంగా ఉపసంహరించుకున్నట్టు కనిపిస్తోందని, ఇదంతా కేవలం తమ భావజాలానికి అనుగుణంగా ఉండమని శాస్త్రవేత్తలను నేరుగా హెచ్చరిస్తున్నట్టు కనిపిస్తోందని, ఇది చాలా ప్రమాదకరమైన పరిణామమని వారు వాపోతున్నారు. గ్రంథచౌర్యం లేదా పని ప్రదేశంలో మహిళా ఉద్యోగినుల వేధింపు వంటి అంశాలపై ఫిర్యాదులున్న శాస్త్రవేత్తలను జాబితా నుంచి తొలగిస్తే తప్పు లేదు.




లేదా వారు చేసిన తప్పును వెల్లడించి, జాబితాలను సవరించినా పరవాలేదు కాని, నిష్కారణంగా, రాగద్వేషాలకు లోబడి కొందరు శాస్త్రవేత్తల పేర్లను అవార్డుల జాబితా నుంచి తొలగించడం సహేతుకం కాదని వారు ఆరోపిస్తున్నారు. చివరి క్షణంలో మంత్రి ఇలా కొన్ని పేర్లను తొలగించడానికి తగిన కారణాలను వారు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం శాస్త్రవేత్తల నోర్లు ఎలా మూయిస్తుందో చూడాలి!

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.